TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

హైదరాబాద్, 20.09.2014:

**తెలంగాణ రిసోర్స్ సెంటర్** ఆధ్వర్యంలో శనివారం 'చంద్రం' భవన్‌లో 140 వ చర్చ **"టిఎన్‌జివో ప్రెసిడెంట్ శ్రీ జి. దేవీ ప్రశాద్ గారితో ముఖాముఖి"** కార్యక్రమంలో

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకోసం విశాల ధృక్పధంతో యావత్ తెలంగాణ సమాజం ఉద్యమించింది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని 100 రోజులు పూర్తయిన సందర్భంలో తెలంగాణకు ప్రధాన సమస్యగా ఉన్న నీళ్ళు, నిధులు, నియామకాలు. వీటిలో ఉద్యోగాలకు సంబంధించిన సమస్యలను తీసుకుంటే ఫజల్ అలీ కమీషన్ హైద్రాబాద్ రాష్ట్రానికి వచ్చినప్పుడు తెలంగాణ ప్రజలు పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆంధ్రలో కలిస్తే తెలంగాణ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుంది అనేది ఇక్కడి ప్రజల ఆవేదన . ఆ వేదనే నిజమై ఆంధ్రప్రదేశ్ ఏర్పాటులో తెలంగాణ ప్రజలు మొత్తంగా ఉద్యోగ అవకాశాలు కోల్పోయారు. ఆ తర్వాత ముల్కీ రూల్స్‌ను రద్దు చేసి నాన్‌ముల్కీలు ఇక్కడి ఉద్యోగాలు కొల్లగొట్టారు. ఆ తర్వాత జోనల్ పోస్టులలో కూడా ఆంధ్రులు ఇక్కడ పాగా వేశారు. ఈ క్రమంలో గిర్‌గ్లాని కమీషన్, జయభారతి కమీషన్, 610 జీవో లాంటివి ఏర్పాటయినా ఆచరణ శూన్యమే. పై కమిటీలు ఇచ్చిన నివేదికలు బుట్టదాఖలైనాయి. ఈ పరిస్థితులలో యావత్ తెలంగాణ ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రం తప్ప మరే పరిష్కారం లేదనే అవగాహనతో తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమించి తెలంగాణ సాధించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో భాగంగా ఉద్యోగుల విభజన కోసం ఏర్పాటు చేసిన కమలనాధన్ కమిటీ ఇంకా విధివిధానాల ఏర్పాటులోనే ఉన్నది. మిగతా రాష్ట్రాల విభజనకు ఆంధ్రప్రదేశ్ విభజనకు తేడా ఉందని ఎంత చెప్పినా వినకుండా స్థానికతను ఆధారంగా తీసుకోకుండా విధివిధానాలు ఏర్పాటటు చేయడంవలన తెలంగాణ ఉద్యోగులకు మళ్ళీ అన్యాయం జరుగబోతోంది. దీన్ని అడ్డుకోకపోతే పరిస్థితి చేజారిపోతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అన్యాయాలు మామూలువి కావు. ఫ్రీజోన్ వివాదం, 177 జీవో లాంటివి తెలంగాణ ఉద్యోగులను ఎంతో ఇబ్బంది పెట్టాయి. వాటిని పరిష్కరించుకోవాలి.

ఉద్యోగాల విభజనలో ఇప్పుడు ఉన్న ప్రధాన సమస్య స్థానికత. ఆరోజు గిర్‌గ్లాని కమీషన్ రిపోర్టును క్యాబినెట్ ఆమోదించింది. అందులో చాలా స్పష్టంగా ఉద్యోగి సర్వీసు పుస్తకంలో స్థానికతను పొందుపరచాలనేది ప్రధాన అంశం. సచివాలయంలోకి సర్వీసు పుస్తకాలు తెచ్చి ఉద్యోగులకు స్థానిక సర్టిఫికెట్లు తెమ్మని చెప్పినప్పటికీ అందులో సగం మంది ఉద్యోగులు స్థానికత ధృవీకరణ పత్రాలు తీసుకురాలేదు. మిగతా సగంలో దాదాపు తెచ్చినవాటిని వాస్తవాలను ధృవీకరించుకోకుండ గుడ్డిగా వ్రాయడం జరిగింది. వీటిని ఆధారంగా తీసుకుని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేవలం 18,000 ఉద్యోగులు మాత్రమే వేరే జోన్‌వాళ్ళు హైద్రాబాద్‌లో ఉన్నారని, అందులో 10,000 తెలంగాణవారు, 8,000 ఆంధ్రవారు ఉన్నారని వీరిని వారి స్థానిక జోన్‌లకు పంపిస్తామని చెప్పి దీనిద్వారా 610 జివోను పూర్తిగా అమలుచేశామని చెప్పటం జరిగింది. దీనికి వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యోగులు ఉద్యమించారు. కానీ కమల్‌నాథన్ కమిటీ వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా ఉద్యోగాలను పంచాల్సిన కమిటీ ఉద్యోగులను పంచుతుంది. తెలంగాణలో ఉన్న ఖాళీలను ఆంధ్రాలోని జూనియర్ ఉద్యోగులతో నింపాలని చూస్తున్నది. దీనివలన తెలంగాణ ఉద్యోగులకు ప్రమోషన్‌లు వచ్చే అవకాశం లేదు. 30 సం॥ల వరకూ తెలంగాణ నిరుద్యోగులకు ఉద్యోగాలు రావు. కాబట్టి స్థానికత ఆధారంగా ఉద్యోగాల పంపిణీ జరగాలి. ఓపెన్ కోటా పోస్టులలో జోనల్ పద్ధతిని అవలంభించలేదు. వాటిలో ఎక్కువ మొత్తంలో ఆంధ్రా ఉద్యోగులున్నారు. ఈ విషయాల్ని పరిగణలోకి తీసుకుని వీటితోపాటు పెన్షనర్లను కూడా విభజించాలి. కమలనాథన్ కమిటీ ఏర్పాటై 7 నెలల

TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

కాలం పూర్తయినా 10% కూడా ఉద్యోగాల విభజన జరగలేదు. ఇది ఇలాగే కొనసాగితే తెలంగాణ ఉద్యోగులు మరింత నష్టపోయే అవకాశం ఉంది అని టిఎన్‌జివో అధ్యక్షులు శ్రీ దేవీ ప్రసాద్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టిఆర్‌సి ఛైర్మన్ వేదకుమార్, జానయ్య, పిట్టల శ్రీశైలం, డా॥ రామకిషన్, వి. రాజమహేందర్ రెడ్డి, బి.సుధాకర్, కె.గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బోనకుర్తి సోమేశ్వర్
టిఆర్‌సి